ఆ టైటిల్స్‌లో దేన్ని ఫిక్స్ చేస్తారు?

మొన్నటివరకూ ఎన్నికల ప్రచారంలో తీరికలేకుండా గడిపిన బాలకృష్ణ.. ఇప్పుడు తన సినిమా షూటింగ్‌లో బిజీ అయిపోయారు. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నది. ఈ సినిమాకు 'వీరమాస్' అనే టైటిల్‌ని ఖరారు చేసినట్టు గతంలో వార్తలొచ్చాయి. ఇప్పుడు ఆ టైటిల్‌తోపాటు ఇంకో రెండు టైటిల్స్ గట్టిగా వినిపిస్తున్నాయి. అందులో ఒకటి 'అసురుడు' కాగా, రెండో 'డెమోన్'. ఈ రెండింటిలో ఓ టైటిల్‌ని ఖరారు చేయనున్నారట దర్శకుడు బాబీ. అసురుడు అంటే రాక్షసుడు. 'డెమోన్' అంటే తెలుగులో భూతం. మరి ఈ రెండు టైటిల్స్‌లో ఏ పేరును ఖరారు చేస్తారో చూడాలి. టైటిల్స్‌కి తగ్గట్టు ఇందులో బాలకృష్ణ పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉంటుందట. ఇందులో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపిస్తారని సమాచారం. బాబీడియోల్ విలన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఊర్వశి రౌటేలా, చాందిని చౌదరి కీలకపాత్రధారులు. తమన్ ఈ సినిమాకు స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే.

సుప్రీం యాస్కిన్

బీభత్సకాండ సెకండ్‌పార్ట్‌లో



'కల్కి 2898 ఏడీ' సినిమా చూసిన ప్రేక్షకుల్లో చర్చనీయాంశంగా మారిన పాత్ర 'సుప్రీం యాస్కిన్'. రెండొందల ఏళ్ల రాక్షసుడు యాస్కిన్‌గా కమల్‌హాసన్ ఒదిగిపోయి నటించారు. నమ్మశక్యం కాని ఆయన రూపం ప్రేక్షకుల్లో చర్చకు దారితీసింది. దర్శకుడు నాగ్‌అశ్విన్ ఒకే సెట్‌లో గ్రీన్‌మ్యాట్ వేసి కమల్ సీన్స్ అన్నీ తీసేశాడు. సకలకళావల్లభుడైన కమల్.. విలన్‌గా కూడా విశ్వరూపం చూపించేశాడు. రీసెంట్‌గా ఈ సినిమాను ఆయన చెన్నయ్‌లో తిలకించారు. ఆ తర్వాత తన పాత్ర గురించి ప్రత్యేకంగా మీడియాతో ముచ్చటించారు. ' 'కల్కి' రెండవభాగంలో నా పాత్ర అధికంగా ఉంటుంది. ఈ పాత్రను అంగీకరించడానికి ఏడాది పాటు ఆలోచించా. అసలు ఈ పాత్ర చేయగలనా అనే సందేహం కూడా కలిగింది. దర్శకుడు నాగీకి సహనం ఎక్కువ. అందరితో అద్భుతంగా చేయించుకున్నాడు. పురాణాలకు సైన్స్‌ని ముడిపెట్టి తెరపై ఓ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. ఎంత ఓపిగ్గా కథ రాసుకున్నాడో అంతే ఓపిగ్గా తెరకెక్కించాడు. దాని ప్రతిఫలమే ఈ విజయం. సుప్రీం యాస్కిన్ బీభత్స కాండను సెకండ్ పార్ట్‌లో చూస్తారు' అన్నారు కమల్‌హాసన్.

విజయుడిగా విశ్వరూపం

'కల్కి 2898 ఏడీ' సినిమా చూసిన వాళ్లంతా హఠాత్తుగా అర్జునుడి పాత్రలో కనిపించిన విజయ్ దేవరకొండను చూసి ఫిదా అయిపోతున్నారు. ఇన్నాళ్లూ యూత్ ఐకాన్‌గా మాత్రమే కనిపించి, మురిపించిన విజయ్ దేవరకొండ.. 'కల్కి 2898 ఏడీ'లో గాండీవాన్ని ధరించి, అర్జునుడిగా కాసేపు చెలరేగిపోయాడు. నిజానికి మైథలాజికల్ పాత్రలు రావడమే అరుదు. పైగా అర్జునుడి పాత్ర. నిడివి తక్కువే అయినా అదరహో అనిపించాడు. విజయుడిగా విజయ్ మేకోవర్, చెప్పిన పవర్‌ఫుల్ డైలాగులు, పలికించిన ఎమోషన్స్ 'కల్కి' హైలైట్స్‌లో భాగమయ్యాయి. తెరపై విజయుడిగా విజయ్ దేవరకొండను చూడగానే ప్రేక్షకుల్లో ఊహించని స్థాయిలో స్పందన వస్తున్నది. ఏదిఏమైనా విజయ్ అని పేరు పెట్టుకున్నందుకు ధనుర్ధారి విజయుడిగా తెరపై విశ్వరూపం చూపించి, సార్థకనాముడు అనిపించుకున్నాడు విజయ్ దేవరకొండ. 'కల్కి 2898ఏడీ' సినిమాతో.. విజయ్‌తో మైథలాజికల్ కేరక్టర్లు కూడా ట్రై చేయొచ్చని నిరూపితమైందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



డబుల్ మ్యూజికల్ హంగామా

రామ్ పోతినేని 'డబుల్ ఇస్మార్ట్' మ్యూజిక్ హంగామాకు రెడీ అయ్యింది. 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా దర్శకుడు పూరీ జగన్నాథ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఆగస్ట్ 15న సినిమా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది కూడా. ఈ నేపథ్యంలోనే ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమాలోని 'స్టెప్పా మార్..' అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌ని జూలై 1న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇందులో భాగంగా శివుడి విగ్రహం ముందు మాస్ డాన్స్ చేస్తున్న రామ్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. భాస్కరభట్ల సాహిత్యం, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, రామ్ పోతినేని డాన్స్ మూమెంట్స్ ఈ పాటకు హైలైట్స్‌గా

యాక్షన్‌తో రఫ్ఫాడిస్తుంది

ఇటీవలే 'అరణ్మనై-2' (తెలుగులో 'బాక్') చిత్రంలో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది అగ్ర కథానాయిక తమన్నా. కథాంశాల ఎంపికలో కొత్తదనానికి పెద్దపీట వేస్తూ కెరీర్‌లో దూసుకుపోతుందీ భామ. తాజా తెలుగు చిత్రం 'ఓదెల-2'లో ఈ అమ్మడు యాక్షన్ విన్యాసాలతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నది. అశోక్‌తేజ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలకమైన యాక్షన్ ఎపిసోడ్స్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ సన్నివేశాల కోసం తమన్నా ప్రత్యేక శిక్షణ తీసుకుందని, ఆమెలోని ఇంటెన్స్ యాక్షన్ కోణాన్ని ఆవిష్కరించే చిత్రమవుతుందని దర్శకుడు తెలిపారు. 'ఓదెల' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిస్తున్న ఈ సినిమా యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుందని నిర్మాతలు తెలిపారు. హెబ్బాపటేల్, వశిష్ఠ ఎన్ సింహ, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాత: డి.మధు, దర్శకత్వం: అశోక్‌తేజ.

వివాదంలో మాధురిదీక్షిత్

ఓ కంపెనీకి చెందిన ప్రచార ఒప్పందం విషయంలో బాలీవుడ్ సీనియర్ నటి మాధురి దీక్షిత్ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది. పాకిస్థాన్ సంతతికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త రెహన్ సిద్ధిఖీ ఆగస్ట్ నెలలో తన కంపెనీల ప్రమోషన్ కోసం టెక్సాస్‌లో భారీ ఈవెంట్‌ను నిర్వహించబోతున్నారు. ఈ కంపెనీకి ప్రచారకర్తగా వ్యవరిస్తున్న మాధురి దీక్షిత్ టెక్సాస్ ఈవెంట్‌కు హాజరుకానుందని తెలిసింది. అయితే రెహన్ సిద్ధిఖీకి పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐతో సంబంధాలున్నాయన్న కారణంతో భారత ప్రభుత్వం ఆయన నిర్వహించే సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో మాధురిదీక్షిత్‌పై సోషల్‌మీడియా వేదికగా తీవ్ర విమర్శలొస్తున్నాయి. టెక్సాస్ ఈవెంట్‌కు సంబంధించిన ఓ పోస్టర్‌ను పొలిటికల్ కాలమిస్ట్ సునందా వశిష్ఠ తన సోషల్‌మీడియా ద్వారా పంచుకుంది. అందులో రెహన్ సిద్ధికీ, మాధురిదీక్షిత్ ఫొటోలున్నాయి. షేర్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రెహన్ సిద్ధిఖీ బ్యాక్‌గ్రౌండ్ ఏమిటో తెలుసుకోకుండా మాధురిదీక్షిత్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నదని, తక్షణమే ఆమె టెక్సాస్ ఈవెంట్‌ను నుంచి తప్పుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదం గురించి మాధురిదీక్షిత్ ఇంకా స్పందించాల్సి ఉంది.

భాగ్యశ్రీ జోరు మామూలుగా లేదు

నక్కతోక తొక్కి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టినట్టుంది పూణే భామ భాగ్యశ్రీబోర్సే. తెలుగులో ఈ ముద్దుగుమ్మ నటించిన ఒక్క సినిమా కూడా ఇంతవరకూ విడుదల కాలేదు. కానీ అవకాశాలు మాత్రం వరుస పెట్టాయి. దానికి కారణం కేవలం భాగ్యశ్రీ అందమే. లుక్ పరంగా తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉండటం కూడా ఓ కారణం కావొచ్చు. రవితేజ 'మిస్టర్ బచ్చన్'లో భాగ్యశ్రీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విడుదల కాకుండానే మరో మూడు తెలుగు సినిమాలకు సంతకం చేసేసింది ఈ అందాలభామ. అందులో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా ఒకటి. ఈ సినిమా షూటింగ్‌లో కూడా ఇప్పటికే భాగ్యశ్రీ పాల్గొన్నట్టు తెలుస్తున్నది. ఇక రెండో సినిమా నానిది. ఆయన హీరోగా సుజిత్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. అందులో కూడా భాగ్యశ్రీబోర్సేనే కథానాయిక. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. అలాగే.. 'లక్కీభాస్కర్' తర్వాత దుల్కర్ సల్మాన్ మళ్లీ తెలుగులోనే ఓ సినిమా చేయనున్నారట. రవి అనే కొత్త దర్శకుడు తెరకెక్కించనున్న ఈ సినిమాలో కూడా భాగ్యశ్రీబోర్సేనే కథానాయికగా కన్ఫర్మ్ అయ్యిందట. ఈ సినిమా ప్రకటన త్వరలో రానుంది. ఈ అందాలభామ జోరు చూస్తుంటే, అనతికాలంలోనే టాలీవుడ్ టాప్ హీరోయిన్ అనిపించుకునేలా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సందేశంతో 'దీక్ష'

కిరణ్‌కుమార్, అలేఖ్య రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'దీక్ష'. ప్రతాని రామకృష్ణగౌడ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పినిశెట్టి అశోక్ కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కె.గౌడ్ మాట్లాడుతూ 'సంకల్పబలం ఉంటే ఏదైనా సాధించగలమనే అంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమా ద్వారా నలుగురు కథానాయికలను పరిచయం చేస్తున్నాం. త్వరలోవిడుదల తేదీని ప్రకటిస్తాం. అలాగే 'మహిళా కబడ్డీ' అనే చిత్రాన్ని 18 భాషల్లో తెరకెక్కించబోతున్నాం' అన్నారు. యువతరానికి సందేశాన్నందించే చిత్రమిదని హీరో కిరణ్ చెప్పారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అనే చక్కటి సందేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని రైటర్ రాంప్రసాద్ తెలిపారు.

సన్నీడియోల్ 'జాట్'

సన్నీ డియోల్ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా హిందీ చిత్రం ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభమైంది. గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్న తొలి హిందీ చిత్రం ఇదే కావడం, సన్నీడియోల్ వంటి అగ్ర హీరో నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలే ఏర్పడ్డాయి. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'జాట్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారని తెలిసింది. ఈ సినిమాలో సన్నీడియోల్ లార్జర్ దేన్ లైఫ్ క్యారెక్టర్‌లో కనిపిస్తాడని, కథానుగుణంగా టైటిల్‌ను పెట్టారని అంటున్నారు. సెప్టెంబర్‌లోగా ఈ చిత్రాన్ని పూర్తి చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని సమాచారం. సయామీఖేర్, రెజీనా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రిషి పంజాబీ, సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, రచన-దర్శకత్వం: గోపీచంద్ మలినేని.

గ్యాంగ్‌స్టర్ పోరాటం

స్వీయ దర్శకనిర్మాణంలో చంద్రశేఖర్ రాథోడ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ కథానాయిక. ఆగస్ట్‌లో విడుదలకానుంది. శుక్రవారం టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రాథోడ్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'నాలుగేళ్ల కిందట ఈ కథ రాసుకున్నా. రెండు గ్యాంగ్స్‌ల మధ్య పోరాటం నేపథ్యంలో కథ సాగుతుంది. రచయిత విజయేంద్రప్రసాద్‌గారికి టీజర్ చూపిస్తే బాగుందని మెచ్చుకున్నారు. త్వరలో దిల్‌రాజుగారికి కూడా టీజర్ చూపించబోతున్నా' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. అభినవ్ జనక్, అడ్ల సతీష్‌కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జీఎల్ బాబు, సమర్పణ: రవి అండ్ నరసింహా, ఫైట్స్, కొరియోగ్రఫీ, ఎడిటింగ్, రచన, నిర్మాత, దర్శకత్వం: చంద్రశేఖర్ రాథోడ్.